క్లుప్తంగా

నమో శివరుద్రాయ


ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేషంగా అభిషేకాలు, పూజలు జరిగాయి. అడవివరం, విజినిగిరిపాలెం,కృష్ణానగర్ తదితర ప్రాంతల నుంచి భక్తులు తరలివచ్చి పరమేశ్వరుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉమాదేవి అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: అడవివరంలో బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్ల మార్పిడి పనుల నిమిత్తం ఈనెల 30 నుంచి మే 2వ తేదీ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. కుమ్మరిదిబ్బ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

అమృతపురంలో సరుగుడుతోట దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సబ్బవరం: మండలంలోని అమృతపురం గ్రామంలో సోమవారం సరుగుడు దగ్ధమైంది. అగ్నిప్రమాదంపై వెన్నల నరేష్ అనే వ్యక్తి సబ్బవరం అగ్నిమాపక అధికారులకు సమచారం అందించారు. అయితే ఫైర్ ఇంజిన్ అందుబాటులో లేకపోవడంతో ఆటోనగర్‌లోని ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపు చేసింది.బీసీ కాలనీలోని వెన్నలవారి కళ్లాలు సమీపంలో జరిగిన ఈ అగ్నిప్రమాదంలో తైనాన శ్రీరంగ నాయకులు,తైనాన కోటి,గండి సత్తిబాబు,గండి రమణబాబు,వెన్నల అచ్చియ్యమ్మ తదితరులకు చెందిన సరుగుడు తోట దగ్ధమయ్యింది.నష్టం విలువ రూ.1.5 లక్షల నుంచి రూ. 2 లక్షలు ఉంటుందని ఆటోనగర్ అగ్నిమాపక అధికారి గోపీకృష్ణ తెలిపారు. ఆకతాయిలు నిప్పు అంటించడం లేదా.. కేర్‌లెస్ స్మోకింగ్ వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

రేపు రక్తదాన శిబిరం

సింహాచలం: జీవీఎంసీ జోన్-8 బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే1వ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వి. రామరాజు తెలిపారు. 98వ వార్డు పద్మావతినగర్‌లోని వాసుదేవ ఫంక్షన్‌హాల్‌లో ఆరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

ముగిసిన సంస్కృత శిక్షణ తరగతులు

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 15 నుంచి 26 వరకు సంస్కృత శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ విజయవంతంగా ముగిసిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహు భాషల్లో ప్రావీణ్యం విద్యార్థులకు ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమ కో ఆర్డినేటర్ వై. లక్ష్మి, శిక్షకుడు శుభ్రజిత్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణపద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయండి
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపు
- విస్తృతంగా ఎన్నికల ప్రచారం


ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను సత్కరిస్తున్న నాయకులు బోకం రామునాయుడు,బండారు శ్రీను


ప్రచార ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు,అభిమానులు


ఎమ్మెల్యేకు పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

సబ్బవరం: ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని.. నిత్యం అందుబాటులో ఉండే తనను గెలిపించాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. మండలంలోని గుల్లేపల్లితో పాటు పలు గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం విస్తృతంగా చేపట్టారు. గుల్లేపల్లిలో ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ పథకాలు,సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాలు,నాయకుల చుట్టూ తిరిగే పరిస్థితులు పోయాయన్నారు.పార్టీలకు అతీతంగా అర్హత ఉన్నత ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. గ్రామ స్థాయిలోనే సచివాలయాలు,రైతు భరోసా కేంద్రాలు,వెల్ నెస్ సెంటర్లు అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజల ముంగిటకు పాలన చేర్చిన గొప్ప నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.నాడు- నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చడంతో పాటు విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకువచ్చి పేదలకు కూడా ఉన్నత విద్య చేరువ చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో అంతా మద్దతుగా నిలవాలని కోరారు. గత ప్రభుత్వంలో 600కు పైగా హామీలను ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేశారన్నారు. ఇప్పుడు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు పొత్తులతో ఓట్లు అడగడానికి వస్తున్న వారికి బుద్ధి చెప్పాలన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను.. ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి,గుల్లేపల్లి సర్పంచ్ బండారు మంగ,పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,బండారు శ్రీను,కొటాన రాము,పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు,జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు,నాయకులు సబ్బవరపు నారాయణమూర్తి,నేబర్తి శ్రీను,ఉగ్గిన గంగునాయుడు, కోన సంజీవరావు,దెడ్డం ప్రసాదరావు,బైలపూడి రామారావు,బోను గంగునాయుడు,బుదిరెడ్ల రామకృష్ణ,కొటాన వెంటక రమణ,యర్రా శ్రీనివాసరావు,గవర రాజు,కోట్ని అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

అడుగడుగునా బ్రహ్మరథం

ఎన్నికల ప్రచారానికి వెళ్లిన అదీప్‌రాజ్ అయా గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గుల్లేపల్లి,బోదువలస, ఎల్లుప్పి, మర్రిపాలెం, అయ్యన్నపాలెం, టి. జంగాలపాలెం, నాయనమ్మపాలెం,వంగలి,టెక్కలిపాలెం గ్రామాల్లో అదీప్‌రాజ్ నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. అడుగడుగునా మహిళలు పూలు జల్లుతూ , హారతులు ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకొన్నారు.

పెందుర్తి బరిలో 14 మంది

- 19 మందిలో ఐదుగురు నామినేషన్ల ఉపసంహరణ
- బ్యాలెట్ వరుస క్రమంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అదీప్‌రాజ్‌కు ప్రథమస్థానం
- బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

పెందుర్తి: సార్వత్రిక ఎన్నికల ఘట్టంలో ప్రధాన ప్రక్రియ పూర్తయింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం సాయంత్రంతో ముగిసింది. మొత్తం 19 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా ఐదుగురు ఉపసంహరించుకున్నారు. దీంతో బరిలో 14 మంది నిలిచినట్లు రిటర్నింగ్ అధికారి శేష శైలజ ప్రకటించారు. వీరికి వరుసక్రమం, గుర్తులు కేటాయించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బ్యాలెట్ వరుస క్రమంలో మొదటి స్థానంలో ఉండగా..తర్వాత స్థానాల్లో బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి బంగారి రమణ, కాంగ్రెస్ అభ్యర్థి పిరిది భగత్, పిరమిడ్ పార్టీ అభ్యర్థి ఈత రోజ, నేషలిస్ట్ జనశక్తి అభ్యర్థి ఏలూరి వెంకటరమణ , జై భారత్ జాతీయ పార్టీ అభ్యర్థి కన్నెపల్లి మహాదేవ్ కల్యాణ్ శ్రీకాంత్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పచెట్టి రమేష్‌నాయుడు, జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు,సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిగా బోలెం వెంకట మురళీ మోహన్ వరుసగా ఉన్నారు.

ఎన్నికల్లో పోటీపడుతున్న అభ్యర్థులు వీరే..

అభ్యర్థి	పార్టీ	గుర్తు
అన్నంరెడ్డి అదీప్‌రాజ్	వైఎస్సార్‌సీపీ	సీలింగ్ ఫ్యాన్
బంగారి రమణ	బహుజన సమాజ్ పార్టీ	ఏనుగు
భగత్ పిరిది	జాతీయ కాంగ్రెస్	హస్తం
ఈత రోజ	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	ఫ్లూట్
ఏలూరు వెంకటరమణ	జాతీయ జనశక్తి పార్టీ	డ్రిల్ మిషన్
కన్నెపల్లి మహాదేవ్ కల్యాణ్ శ్రీకాంత్	జై భారత్ జాతీయ పార్టీ	బ్యాటరీ టార్చ్
పెచ్చేటి రమేష్‌నాయుడు	నవరంగ్ కాంగ్రెస్ పార్టీ	బకెట్
పంచకర్ల రమేష్‌బాబు	జనసేన	గ్లాస్ టంబ్లర్
బోలెం వెంకట మురళి మోహన్	సమాజ్‌వాదీ పార్టీ	సైకిల్ పంప్
ఆదారి నాగరాజు	ఇండిపెండెంట్	విజిల్
కూండ్రపు సన్యాసిరావు	ఇండిపెండెంట్	కుట్టు మిషన్
పొన్నాడ అప్పలనాయుడు	ఇండిపెండెంట్	గ్యాస్ స్టవ్
గుంటూరు వెంకటనరసింహారావు	ఇండిపెండెంట్	రింగ్
వద్దాది ఉదయ్‌కుమార్	ఇండిపెండెంట్	టీవీ రిమోట్

నేడు గ్రామ దేవతల పండగలు


పెదముషిడివాడ పైడిమాంబ


పి.బోనంగి బోయమాంబ

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ, పి.బోనంగి గ్రామాల్లో కొలువుదీరిన పైడిమాంబ, బోయమాంబ అమ్మవార్ల పండగను అట్టహాసంగా నిర్వహించడానికి ఆ గ్రామాల ప్రజలు సన్నద్ధమయ్యారు. గ్రామ పొలిమేరల్లో కొలువుదీరిన అమ్మవార్లకు మంగళవారం వేకువ జాము నుంచి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. గ్రామ దేవతలను దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయాల వద్ద షామియానాలు ఏర్పాటు చేసి తాగు నీరు, మజ్జిగ, ఉచిత ప్రసాద ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు చెప్పారు. డప్పులు, చిడతలు, తప్పెటగుళ్లు, కోయడ్యాన్సులు, కోలాటాలతో అమ్మవార్లను పుర వీధుల్లో ఊరేగించిన అనంతరం భారీ బాణ సంచాకాల్పులతో రాత్రికి గ్రామ దేవతల అనుపు మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని పెదముషిడివాడ ఆలయ కమిటి చైర్మన్ పల్లా అప్పారావు(కబడ్డీ), పి.బోనంగి సర్పంచ్ బండారు కల్పనరాజశేఖర్ చెప్పారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు

పరవాడ: మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పలు అంశాలను ప్రస్తావించారు. మంచినీటి ట్యాంకులు, బోర్లు, కుళాయిల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బోర్లు మరమ్మతులకు గురైతే వెంటనే వాటి రిపేర్లు పూర్తి చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో విద్య, వైద్య, నీటి పారుదల, గృహ నిర్మాణశాఖలు, పల్లెల్లో నెలకొన్న సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా సమావేశంలో ఎటువంటి తీర్మానాలు చేయ లేదు. సమావేశంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, అప్పలరాజు, ఎంపీడీవో కీర్తి స్పందన, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం


విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న గురుమాత అన్నపూర్ణమ్మ

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో విద్యార్థులకు మూడు వారాల పాటు నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాన్ని గురుమాత అన్నపూర్ణమ్మ విద్యార్థులకు గురుమంత్ర దీక్ష ఇచ్చి ప్రారంభించారు. వచ్చే నెల 20వ తేదీ వరకూ శిబిరం నిర్వహించనున్నట్లు తెలియజేసారు. 5 నుంచి 9వ తరగతి వరకూ చదువుతున్న సుమారు 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు గణితాచార్యులుగా సేవలు అందించిన మల్లాది నరసింహమూర్తి, సత్యవతి బోధిస్తారని చెప్పారు. ఇంగ్లిష్,గణితం, వైదిగ గణితంతో పాటు నేటి సమాజంలో లోపిస్తున్న నైతిక విలువలు, దేశ సంస్కృతి పట్ల అవగాహన,ధార్మికత, నైతిక విలువలు,జాతీయ భావాలు,దేశభక్తి,దైవ శక్తి, సనాతన ధర్మం నాయకత్వ లక్షణాలు వంటి వాటిపై అవగాహన కల్పిస్తారన్నారు.వీరికి యోగాభ్యాసం, సమతుల ఆహార నియమాలు,ఆట పాటలు,నీతి శ్లోకాలు,క్విజ్,వక్తృత్వం,బేసిక్ కంప్యూటర్ పరిజ్ఞానం అందిస్తామని గురుమాత అన్నపూర్ణ తెలిపారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

ఈవో శ్రీనివాసమూర్తి


మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: మే 10న సింహగిరిపై జరిగే చందనోత్సవంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులకు సూచించారు. సింహగిరిపై కాటేజీలో సోమవారం దేవస్థానం శానిటేషన్ , ఇతర అధికారులతో ఈవో సమావేశం నిర్వహించారు.చందనోత్సవం రోజు స్వామిని దర్శించుకోవడానికి లక్షల సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో శానిటేషన్‌పై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. వచ్చేనెల 8న గంధం అమావాస్య పర్వదినం రోజు నుంచి చందనోత్సవం ముగిసే వరకు సింహగిరికి భక్తుల తాకిడి కొనసాగుతుందన్నారు. ఈ నేపథ్యంలో శానిటేషన్ విధులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. డ్రైనేజీల రిపేర్లు ఉంటే ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఏఈవోలు వీబీవీ రమణమూర్తి, పాలూరి నరసింగరావు, డీఈ నాగేశ్వరరావు, ఏఈ హరి, శానిటేషన్ సూపరింటెండెంట్ ప్రసన్నలక్ష్మి, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

ఐఐఎంలో శిక్షణ తరగతుల ప్రారంభం


శిక్షణకు హాజరైన అధికారులతో ఐఐఎం సంచాలకుడు ఆచార్య చంద్రశేఖర్

ఏయూ క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో మహానంది కోల్‌ఫీల్డ్ లిమిటెడ్‌కి సంబంధించిన అధికారులకు ఐదు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఐఐఎం సంచాలకుడు ఆచార్య ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తి రంగంలో అత్యుత్తమ సంస్థల్లో ఒకటిగా ఎంసీఎల్ కీలక భూమిక పోషిస్తోందన్నారు. వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ అంతర్గతంగా, వ్యవస్థాగతంగా నాయకత్వం ఎంతో అవశ్యకమన్నారు.

ఎన్నికల పోరు.. ప్రచార హోరు

ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తికావడంతో ఆయా పార్టీల అభ్యర్థులు, మద్దతు దారులు ప్రచారం ముమ్మరం చేశారు. వైఎస్సార్‌సీపీ మద్దతు దారులు ఇంటింట ప్రచారంలో దూసుకుపోతున్నారు. మిగిలిన పార్టీల నాయకులు, అభ్యర్థులు కూడా సోమవారం విస్తృతంగా ప్రచారం చేపట్టారు.


ముత్యాలమ్మపాలెంలో ప్రచారం సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మెట్టపాలెంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు


ప్రహ్లాదపురంలో మహిళను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న దాసరి అన్నపూర్ణ తదితరులు


కార్మికనగర్‌లో ప్రచారం చేస్తున్న అజయ్‌రాజ్, మెంటి మహేష్

పరవాడ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉంటారని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పీఎస్ రాజు అన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మద్దతుగా మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, సచివాలయ కన్వీనర్ బొంది అచ్చిబాబు తదితరులతో కలిసి వారు ముత్యాలమ్మపాలెంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఫ్యాను గుర్తుపై ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సూరాడ మసేను, చినమసేను, మసేను తదితరులు పాల్గొన్నారు.

మెట్టపాలెంలో

నాయుడుపాలెంలో సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య ఆధ్వర్యంలో సోమవారం నాయుడుపాలెం శివారు మెట్టపాలెం, బండారుపాలెం, పాతరాజానపాలెంప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం సాగించారు. ఉప సర్పంచ్ రాజాన ముత్యాలనాయుడు, నాయకులు బండారు కృష్ణబాబు, దొడ్డి ముత్యాలు, కిలపర్తి అప్పలనాయుడు, పైల ముత్యాలనాయుడు, రాజాన సత్యనారాయణ, సారిపల్లి సోమునాయుడు, దొడ్డి రాజేష్, కన్నూరు నరేష్, అయ్యబాబు, దాదానాయుడు పాల్గొన్నారు.

93వ వార్డులో..

సింహాచలం: జీవీఎంసీ 93వవార్డు ప్రహ్లాదపురంలో సోమవారం వైఎస్సార్‌సీపీ 93వవార్డు ఇన్‌చార్జి దాసరి అన్నపూర్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దాసరి సత్తిబాబు, బండి సత్తిబాబు, సూరిబాబు, హరి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుపై ఓటేయండి

పెందుర్తి: వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ తరఫున రాంపురం పంచాయతీలో సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, 97వ వార్డులోని గిరిప్రసాద్‌నగర్, కార్మికనగర్‌లో అదీప్‌రాజ్ సోదరుడు అన్నంరెడ్డి అజయ్‌రాజ్, అజయ్‌రాజ్ సతీమణి మౌనిక, వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్ సోమవారం విస్తృత ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు.

నవరంగ్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం

నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పచ్చెటి రమేష్‌నాయుడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. బకెట్ గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని కోరారు.

కాలుష్యరహిత విశాఖే లక్ష్యం


సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్ : వారంలో ఒకరోజు ప్రజా రవాణాను ఉపయోగించి నగరంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు, కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. తన బంగ్లా నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒకరోజు ప్రజా రవాణాను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు దానిని అనుసరిస్తున్నారన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో-జీరో పొల్యూషన్‌లో భాగంగా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

సముద్రాలపై అవగాహన అవసరం

ఏయూ క్యాంపస్: సముద్రాలపై అవగాహన కల్పించడం, వాటి సంరక్షణ దిశగా ప్రజలను నడిపించడం ఎంతో అవసరమని గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ఆచార్య కె.ఎస్.కృష్ణ అన్నారు. బీచ్ రోడ్డులోని ఐసీఏఆర్-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీష్ టెక్నాలజీ 67వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సముద్ర జీవావరణంపై ప్రజల్లో చైతన్యం పెంచాలని, వాటి ప్రాముఖ్యతను తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖపట్నం ఐసీఏఆర్-సీఐఎఫ్‌టీ సైంటిస్ట్ ఇన్‌చార్జి డాక్టర్ యు.శ్రీధర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో తమ సంస్థ సాధిస్తున్న ప్రగతిని, విశేషాలను వివరించారు. నిబద్ధత ప్రగతి, ఆవిష్కరణ దిశగా సాగిస్తున్న అభివృద్ధిని నిదర్శనంగా 67వ వ్యవస్థాపక దినోత్సవం నిలుస్తోందన్నారు. ఆరు దశాబ్దాలుగా ఎంతో ముఖ్యమైన పరిశోధనలను తమ కేంద్రం నిర్వహించిందన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు చలువ కళ్లద్దాలు, వాటర్ బాటిళ్ల పంపిణీ


ట్రాఫిక్ సిబ్బందికి థర్మల్ వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న సీపీ రవిశంకర్, జేసీపీ ఫకీరప్ప

అల్లిపురం : మండుటెండలో విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సోమవారం థర్మల్ వాటర్ బాటిళ్లు, నాప్‌కిన్లు, చలువ కళ్లద్దాలు, తెలుపు టోపీలు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. అదే విధంగా యంగ్ ఇండియన్స్ ఎన్‌జీవో సంస్థ సహకారంతో హార్మొనీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అందజేసిన 66 ఎమర్జెన్సీ ట్రామా కిట్లను ట్రాఫిక్ పోలీసులు, ఎలక్షన్ విధుల్లో ఉన్న చెక్‌పోస్టు సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రూ.2.65 లక్షల సీపీ వెల్ఫేర్ ఫండ్ వెచ్చించి 400 థర్మల్ వాటర్ బాటిళ్లు, నాప్‌కిన్‌లు, చలువ కళ్లద్దాలు, టోపీలు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశామన్నారు. మండుటెండల్లో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు.

66 ట్రామా కిట్ల అందజేత..

అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలు కాపాడడంలో పోలీసులను మరింత భాగస్వామ్యం చేస్తూ ప్రథమ చికిత్సకు అవసరమయ్యే రూ. 2 లక్షలు విలువ చేసే ఎమర్జెన్సీ ట్రామా కిట్లను యంగ్ ఇండియన్స్ ఎన్‌జీవో సంస్థ అందజేసింది. ఈ కిట్లలో 6 పోర్టబుల్ స్ట్రెచర్లు, ఏఎంబీయూ బ్యాగ్ (ఎయిర్ మిక్సర్ బ్లోయింగ్ మిషన్)లను అందజేశారు. మంగళవారం నుంచి కేజీహెచ్‌లో కిట్ల వినియోగంపై డాక్టర్ ప్రత్యూష ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, ట్రాఫిక్ ఏడీసీపీ, ఏసీపీ-1, ఏసీపీ-2, హార్మొనీ ఫుడ్స్ డైరెక్టర్ విరాట్ మహేశ్వరి, యంగ్ ఇండియన్స్ చైర్ పర్సన్ రాయ్ కొడాలి, హర్షవర్ధన్, హర్షనందన్, రాణా ఉప్పలపాటి, డాక్టర్ ప్రత్యూష పాల్గొన్నారు.